క్లుప్తంగా

ముత్యాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



ముత్యాలమ్మ హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని అధికారులు బుధవారం లెక్కించారు. సుమారు 69 రోజులు కాలానికి గాను రూ.13,53,480 ఆదాయం లభించినట్లు ఈఓ ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ ఇన్‌స్పెక్టర్ వర్దినేడి వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ దాసరి మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌పై శబరిమల యాత్ర



ముత్యాలపల్లి నుంచి శబరిమలకు సైకిల్‌పై బయలుదేరిన మాలధారులు

మొగల్తూరు: అయ్యప్ప మాలలు వేసుకున్న స్వాములు శబరిమల అయ్యప్పను దర్శించుకునేందుకు బుధవారం సైకిల్స్‌పై బయలుదేరారు. ముత్యాలపల్లి గ్రామానికి చెందిన దొంగ వెంకటేశ్వర్లు గురు స్వామి ఆధ్వర్యంలో దొంగ యుగందర్ స్వామి పర్యవేక్షణలో సుమారు 11 మంది స్వాములు సైకిల్స్‌పై బయలుదేరారు. గ్రామ దేవత బండి ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో ఇరుముడులు ధరించి సైకిల్స్‌పై యాత్రగా శబరిమలకు బయలుదేరారు.

మార్టేరులో ఉచిత గుండె వైద్య శిబిరం



మార్టేరులో వైద్య శిబిరం ప్రారంభిస్తున్న వైద్యులు

పెనుమంట్ర: విజయవాడకు చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు, డాక్టర్ వైవీ రావు హాస్పటల్‌కు చెందిన డాక్టర్ శ్రీ దేవి వైద్యబృందం బుధవారం మార్టేరు గ్రామంలో దేవాంగుల కల్యాణ మండపంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. మార్టేరు పంచగ్రామాల నుంచి 90 మందికి పరీక్షలు చేయకుండా గుండె నొప్పికి సంబంధించి బీపీ పరీక్షలు, ఈసీజీ, టూడీ ఎకో పరీక్షలు చేశారు. వీరిలో 20 మందికి సంబంధించి సమస్య ఉన్నట్లు గుర్తించి విజయవాడకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో గౌరీ శంకర్ దేవాంగ యువజన సేవా సంఘం అధ్యక్షులు అల్లాడ కుమారస్వామి, చట్టం లక్ష్మణ్, పిచ్చుక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై అఘాయిత్యం

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వృద్ధురాలిపై అఘాయిత్యం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తుమ్మ గోప్పి గ్రామానికి చెందిన తాళ్లూరు సుశీల (65)పై అదే గ్రామానికి చెందిన ఈదా కృపావరం తెల్లవారుజామున అఘాయిత్యం చేసినట్టు బాధితురాలు సుశీల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రూరల్ ఎస్సై వీర్రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దిగుబడి లేక దిగాలు



వరికోత మెషీన్ ద్వారా కోతలు కోస్తున్న దృశ్యం



వెంకట్రామపురంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న వ్యవసాయ కూలీలు

- భారీగా తగ్గిన వరి దిగుబడులు
- ఎకరానికి సరాసరి ఆరు బస్తాల తగ్గుదల

పెనుగొండ: వరి దిగుబడి తగ్గడంతో రైతన్నలు ఢీలా పడుతున్నారు. సార్వా కోతలు ప్రారంభం కావడంతో దిగుబడులపై ఆశలు పెంచుకున్న రైతన్నలకు తగ్గిన దిగుబడులు రైతుల ఆశలపై నీళ్లు జల్లినట్లయ్యాయి. ఆచంట నియోజకవర్గంలో ఆచంట మండలంలో 10200 ఎకరాల్లోనూ, పెనుగొండ మండలంలో 1100 ఎకరాల్లోనూ, పెనుమంట్ర మండలంలో 13200 ఎకరాల్లోనూ పోడూరు మండలంలో 11400 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. వీటిలో 70 శాతానికి పైగా రైతులు ఎంటీయూ 1318 వరి రకం, మిగిలిన రైతన్నలు స్వర్ణ, ఎంటీయూ 1121, పీఆర్ 126 వరి రకాలు వచ్చే సీజన్‌కు విత్తన రకాలుగా సాగు చేశారు. ముందుగా సాగు చేసిన స్వర్ణ రకం కోతలకు రావడంతో రెండు మూడు రోజులుగా నియోజకవర్గంలో కోతలకు రైతన్నలు శ్రీకారం చుట్టారు.

32 బస్తాలే దిగుబడి

ఎకరానికి కనీసం 40 బస్తాలు దిగుబడులు వస్తాయని రైతన్నలు భావించారు. అయితే, ఎకరానికి కనిష్టంగా 32 బస్తాలు, గరిష్టంగా 36 బస్తాలు మాత్రమే రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి 6 బస్తాలకు పైగా దిగుబడులు తగ్గడంతో పెట్టుబడులకు కనీసం వడ్డీ వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి రూ.20 వేలకు పైగా పెట్టుబడి పెట్టి, కుటుంబం మొత్తం సాగు కోసం కష్టపడ్డామంటూ చిన్న, సన్నకారు రైతులు వాపోతున్నారు. స్వర్ణ సంగతి ఇలా ఉండగా ఎంటీయూ 1318 రకం సైతం రైతుల అంచనాలను తలకిందులు చేస్తున్నాయని రైతులు తెలిపారు. అక్కడక్కడా చెదురుమదురుగా కోతలు కోసిన రైతులకు ఎకరానికి స్వర్ణ రకంగానే దిగుబడులు వచ్చాయని రైతులు తెలిపారు. దీంతో పెట్టుబడులు రావడం కష్టసాధ్యమని వాపోతున్నారు. ఈ సీజన్‌లో జూలై సెప్టెంబరులలో వచ్చిన వరుస తుఫాన్‌లతో ఈనిక దశలో ప్రభావం చూపిందని రైతులు తెలిపారు. గింజ తాలుగా మారడం వలనే దిగుబడులు తగ్గాయని తెలిపారు.

దిగుబడులు తగ్గాయి



సార్వా సీజన్‌లో దిగుబడులు తగ్గాయి. కనీసం 40 బస్తాలు దాటుతాయని అంచనా వేసుకున్నాం. 32 నుంచి 36 బస్తాలు దిగుబడులు వస్తున్నాయి. కోతలు సీజన్ ప్రారంభం కావడంతో వాతావరణంలో మార్పులు లేకుండా ఉంటే రైతులు గట్టెక్కుతారు. కనీసం పెట్టుబడులతో బయట పడతారు.

– సత్తి సుబ్బారెడ్డి, రైతు, చిన్నం వారి పాలెం

వరుస తుఫాన్లతో ఇబ్బంది



వరుస తుఫాన్లతో రైతులు ఇబ్బందులు పడ్డారు. తుపాన్లు భారీ వర్షాల వలనే దిగుబడులపై ప్రభావం చూపింది. ఈ సీజన్‌లో పెట్టుబడులు సైతం పెరిగాయి. పెట్టిన పెట్టుబడులకు, మగతాలకు దిగుబడులు సరిపెట్టినా రైతు కష్టానికి మాత్రం రూపాయి మిగలదు.

– చిటికెన స్వామి రైతు వడలి

1న కాపు వన సమారాధన



సమావేశంలో మాట్లాడుతున్న కాపుసంఘం నేతలు

నరసాపురం: నరసాపురం నియోజకవర్గ కాపు, తెలగా కార్తీకవన సమారాధన కార్యక్రమం డిసెంబర్ 1న ఆదివారం నిర్వహిస్తున్నట్టు కాపుసంఘం నేతలు తెలిపారు. బుధవారం స్థానిక తెలగా కళ్యాణమండపంలో సంఘ నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి సురేష్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వనసమారాధనను సీతారామపురం కొండవీటివారి తోటలో నిర్వహిస్తున్నామన్నారు. దాదాపు 30వేల మంది హాజరవుతారని అందుకు తగ్గ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో కాపు సంఘం నేతలు డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, జీవీకే రామారావు, కావలి నాని, కోటిపల్లి వెంకటేశ్వరరావు, డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి, గుగ్గిలపు మురళి, వన్నెంరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి గంగరాజు

నరసాపురం: రాజీ మార్గమే రాజమార్గమని నరసాపురం సీనియర్ సివిల్‌జడ్జి జి.గంగరాజు అన్నారు. జాతీయలోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు కృషి చేయాలని సూచించారు. డిసెంబర్ 14న జరగనున్న లోక్ అదాలత్ నిర్వహణపై బుధవారం కోర్టు హాల్‌లో పోలీసు అధికారులతో జడ్జి గంగరాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీసు స్టేషన్‌ల వారీగా పెండింగ్ కేసులు, వాటిలో రాజీ పడదగిన కేసులు గుర్తించి ఇరుపక్షాలకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. సమావేశంలో నరసాపురం జూనియర్ సివిల్‌జడ్జి కె.శ్రీనివాస్, నరసాపురం, పాలకొల్లు సీఐలు, మొగల్తూరు, యలమంచిలి ఎస్సైలు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి నవరాత్రి మహోత్సవాలు

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరులో ఉన్న శ్రీ వీరభద్రస్వామి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 17 నుంచి ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఈ నెల 25 వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 25న ప్రబల సంబరం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మెడలోని బంగారు నానుతాడు చోరీ

భీమవరం: స్థానిక సుంకర పద్దయ్య వీధి నుంచి తన భర్తతో కలిసి మోటారు సైకిల్‌పై వెళుతుండగా గుర్తుతెలియని ఇద్దరు తన మెడలోని బంగారు నానుతాడు దొంగిలించారని పట్టణానికి చెందిన జవ్వాది వరలక్ష్మి ఫిర్యాదు చేసినట్టు భీమవరం వన్‌టౌన్ ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి టిడ్కో నివాసం వద్ద నుంచి వరలక్ష్మి తన భర్త గణేష్ శ్రీనివాస్‌తో కలిసి తాడేరురోడ్డులోని టిడ్కో ఇళ్ల వైపునకు వెళుతుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు తమ బైక్‌ను ఆపి తన మెడలోని రూ.1.25 లక్షల విలువైన అయిదు కాలుసుల బంగారు నానుతాడు లాక్కున్నారని పేర్కొన్నారు. వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



నరసాపురం: మాట్లాడుతున్న నరసాపురం ఆర్డీఓ దాసి రాజు



పెనుమంట్ర: మార్టేరులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నరసాపురం: పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని స్థానిక లైబ్రరీ వద్ద బుధవారం పండా నాగేంద్ర త్రినాథ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్డీఓ మాట్లాడుతూ ప్రస్తుత టీవీ, సెల్‌ఫోన్, ఇంటర్నెట్ యుగంలో పుస్తక పఠనం పూర్తిగా తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. పుస్తక పఠనమే విజయమార్గమని గొప్పగొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదివితేనే అర్థం అవుతుందని చెప్పారు. లైబ్రేరియన్ కుమారి మాట్లాడుతూ పిల్లలకు చిన్న, చిన్న కథల పుస్తకాలు చదవడం దగ్గర నుంచి అలవాటు చేయాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సాహితీవేత్త రెడ్డప్ప ధవేజీ, మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, అజిత్‌కుమార్ జైన్ పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: గ్రంథాలయంలో ఎక్కువ సమయం గడిపిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో నిలుస్తారని బీఎస్ఎన్ఎల్ రిటైర్డు ఉద్యోగి, కవి, కేసీహెచ్ పెద్దిరాజు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.టి రాజరాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులను పెద్దిరాజు చేతుల మీదుగా అందజేశారు. లైబ్రేరియన్ వి.రమేష్ పాల్గొన్నారు.

మార్టేరులో..

పెనుమంట్ర: విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని మానవత సంస్థ మండల అధ్యక్షుడు కర్రి కృష్ణారెడ్డి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సమావేశం బుధవారం మార్టేరు రోటరీ క్లబ్ భవనంలో నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన కృష్ణారెడ్డి మాట్లాడుతూ నాడు పాఠశాలలకు వెళ్లి వచ్చిన అనంతరం ఎక్కువ సమయం గ్రంథాలయంలో పుస్తక పఠనం ద్వారా జనరల్ నాలెడ్జ్‌ని పెంపొందించమే కాకుండా క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల రామారెడ్డి, మానవత జిల్లా కన్వీనర్ కొత్త సత్యనారాయణమూర్తి, రిటైర్డు తహసీల్దార్ చర్ల సూర్యనారాయణరెడ్డి, పడాల సువర్ణగౌరి తదితరులు పాల్గొన్నారు.

13 కాసుల 6 గ్రాముల బంగారం స్వాధీనం



మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్ : మండలంలోని పూలపల్లికి చెందిన కట్టా సుబ్బారావు అనే పాత నేరస్థుడిని అరెస్ట్ చేసి రూ.3.50 లక్షల విలువైన 13 కాసుల 6 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ సీఐ గుత్తుల శ్రీనివాస్ తెలిపారు. పాలకొల్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 40 కేసుల్లో నిందితుడిగా ఉన్న సుబ్బారావును పోడూరు, పాలకొల్లు రూరల్ పోలీస్ స్టేషన్లలో జరిగిన మూడు దొంగతనాలకు సంబంధించి అరెస్ట్ చేశామన్నారు. సమావేశంలో పోడూరు ఎస్సై సుధాకరరెడ్డి, పీసీలు పాల్గొన్నారు.

బాలల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ వర్ధనపు స్వరూప్

పాలకొల్లు అర్బన్: రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా ఒకటో తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు పుట్టుకతో వచ్చే లోపాలు, దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి వైద్య సహాయం అందిస్తామని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ వర్ధనపు స్వరూప్ అన్నారు. మండలంలోని పూలపల్లి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ నెల 14 నుంచి అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ వర్కర్లు ప్రతీ విద్యార్థికి ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ పరీక్షలతో పాటు 40 రకాల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తారన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పూలపల్లి సచివాలయంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకా కార్యక్రమంతో ఫ్యామిలీ ఫిజిషియన్ శిబిరాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్లు అద్దాల ప్రతాప్‌కుమార్, ఎం.నవ్యజీవన్, పాఠశాల హెచ్ఎం జీటీవీ కుమార్, గుడాల హరిబాబు, కేటీకే రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

చట్టబద్ధమైన దత్తతపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషలైజ్ అడ్వాన్స్ ఏజెన్సీ మేనేజర్ జయలక్ష్మి

మొగల్తూరు: చటబద్ధమైన దత్తత పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అడ్వాన్స్ స్పెషలైజ్ ఏజెన్సీ మేనేజర్ పి.జయలక్ష్మి సూచించారు. బుధవారం మొగల్తూరు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిశు గృహలోని మిషన్ వాత్సల్య ద్వారా దత్తత కార్యక్రమాలు జరుగుతుంటాయన్నారు. దత్తతకు దరఖాస్తులు చేసుకున్న తల్లిదండ్రులకు, మహిళా సంరక్షణ కార్యదర్శులకు చట్టబద్ధమైన దత్తత నిబంధనలపై అవగాహన కల్పించడం ద్వారా పిల్లలను దత్తత ఇస్తారన్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ స్వాతి, గంగాదేవి, ఎంఈఓ శామ్యూల్ జాన్, హెచ్ఎం రవిశంకర్ సర్కార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన



చినమల్లంలో లక్ష బిల్వార్చన పూజలు చేస్తున్న భక్తులు

పెనుగొండ: కార్తీక మాసం సందర్భంగా చినమల్లంలోని పార్వతీ మల్లేశ్వర స్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన వేడుకగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు కొండవీటి రాంబాబు ఆచంట రుత్వికులతో ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష బిల్వార్చన పూజలు నెక్కంటి బుచ్చేశ్వరరావు, కృష్ణవేణి, దాట్ల శ్రీనివాసరాజు, సుభాషిని, వేమవరపు నాగరాజు, నాగవేణి, పాదల వెంకన్నబాబు లక్ష్మీ, పాదల సూరిబాబు కుమారి, పాదల సుమన్ నాగమణి దంపతులు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు.

వసుధ సేవలు అభినందనీయం



వసుధ ఫౌండేషన్ తరపున ఆర్థిక సహాయం చెక్కులు అందజేస్తున్న చేకూరి సూరిబాబు

పాలకొల్లు అర్బన్: విద్య, వైద్య, సామాజిక రంగాలకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు అందిస్తున్న సేవలు అభినందనీయమని క్షత్రియ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు చేకూరి సూరిబాబు అన్నారు. ముగ్గురు రోగ పీడితులకు ఫౌండేషన్ తరపున మంజూరైన ఆర్థిక సహాయాన్ని బుధవారం క్షత్రియ సంక్షేమ పరిషత్ కార్యాలయంలో సూరిబాబు అందజేశారు. అరట్లకట్ట గ్రామానికి చెందిన ముదునూరి వెంకటసత్యవతికి రూ.10వేలు, పోలవరం గ్రామానికి చెందిన ముదునూరి రామసీతకు రూ.10వేలు, ఈడూరు గ్రామానికి చెందిన సుబ్బరాజుకి రూ.10వేలు ఫౌండేషన్ తరపున వెంకట్రామరాజు అందజేసిన చెక్కులను సూరిబాబు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు, క్షత్రియ సంక్షేమ పరిషత్ కోశాధికారి కోసూరి సుబ్బరాజు, బీఎస్ఎన్ఎల్ రాజు, రిటైర్డు టీచర్ వెంకటపతివర్మ తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా బృందం పర్యటన

కాళ్ల: ఒడిస్సా మత్స్యశాఖ బృందం కాళ్ల మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం క్షేత్ర పర్యటన చేశారు. మత్స్యశాఖలో అత్యధిక దిగుబడి సాధిస్తున్న దృష్ట్యా రైతులు పాటిస్తున్న యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సీసలి గ్రామంలో చేపలు, రొయ్యల చెరువుల సాగుతో పాటు, నెక్సస్ ఫీడ్ ఫ్యాక్టరీ, కాళ్ల గ్రామంలో స్పాన్ హేచరీలను ప్రత్యేకంగా పరిశీలించారు. తమ రాష్ట్రంలోని మత్స్య సంపదను మెరుగుపర్చేందుకు ఈ పర్యటనకు వచ్చామన్నారు.

సౌర విద్యుత్‌తో నగదు ఆదా



వినియోగదారుడితో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): సౌర విద్యుత్ ఏర్పాటుతో ఎంతో నగదు ఆదా అవుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. భీమవరం పట్టణం హౌసింగ్ బోర్డ్ కాలనీలో కె.సూర్యనారాయణ రాజు ఇంటిపై ఏర్పాటు చేసుకున్న సోలార్ విద్యుత్ యూనిట్‌ను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వినియోగదారుడు కె.సూర్యనారాయణ రాజు కరెంట్ బిల్లు తగ్గిందని చెప్పడంతో జాయింట్ కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సౌర విద్యుత్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించి సౌర విద్యుత్ వాడకం పెరిగేలా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. జేసీ వెంట జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఆలపాటి రఘునాథ బాబు, ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు, ఏఈ పద్మశ్రీ, తదితరులు ఉన్నారు.


బాలల హక్కులను పరిరక్షించాలి



పేపర్ క్లిప్పింగ్ ఆల్బమ్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో జీవీ సూర్యనారాయణ

పాలకొల్లు అర్బన్: బాలల హక్కులను పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంఈఓ జీవీ సూర్యనారాయణ అన్నారు. మండలంలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయన బుధవారం పరిశీలించారు. చింతలగరువు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సూర్యకుమార్ రూపొందించిన బాలల సమస్యలు– పరిష్కారాలపై పేపర్ క్లిప్పింగ్‌లతో రూపొందించిన ఆల్బమ్‌ను ఎంఈఓ ఆవిష్కరించారు. బాలలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ కాపాడాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ కె.బీబీ విజయలక్ష్మి, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం కొమ్మోజు మధుసూదన్‌రావు, ఉపాధ్యాయుడు ఎంవీ రాజశేఖర్, సీఆర్‌పీ ఎం.శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సలహా కేంద్రాలను వినియోగించుకోవాలి



కళాశాలలో మాట్లాడుతున్న సఖి సంస్థ న్యాయవాది దుర్గారాణి

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ, వైద్య, విద్యా సలహా కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సఖి సంస్థ న్యాయవాది దుర్గారాణి చెప్పారు. పట్టణంలోని దాసరి నారాయణ రావు మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం లీగల్ క్లబ్, ఎన్ఎస్ఎస్, మహిళా సాధికార శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో దుర్గారాణి మాట్లాడారు. మహిళల రక్షణకు సంబంధించిన టోల్ ఫ్రీ నంబర్లు 181, 112, పోలీస్ హెల్ప్‌లైన్ 112, సైబర్ క్రైమ్ 1930 వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, లీగల్ క్లబ్ కన్వీనర్ డా.జీఎస్ సింగ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జీఎస్‌జీ రాజ్, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ కంచికచర్ల దగ్గర CRDAలో ప్లాట్ కొన్నవారికి 3 లాభాలతో 15 సెంట్లు ఎర్రచందనం ప్లాట్ ఫ్రీ. హైదరాబాద్ హైవేకి, 60 'ఆ' రోడ్డుకు, ఇళ్లకు ఆనుకుని ORRకి 200మీ దగ్గర ప్లాట్స్ ✆ 88018 03689 [B-357]

Wanted

■ మా సంస్థ ద్వారా ఉంగుటూరులో గల ప్రముఖ పరిశ్రమ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ 12గం॥లు ఆకర్షణీయమైన జీతం. సంప్ర॥99895 30260. [P-772841]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం.HYD.7995984445 [HA-99066]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-30k మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోమ్ అవకాశం కలదు. 8121818692 [G-9075]

■ త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను, చంటి పిల్లలను, చూసుటకు వర్కర్స్/నర్సులు కావాలి. ఫ్రీ వసతి, ఫుడ్, జీ : 18K. Ph: 8520980099, 8520874499 [SCA24000673]

■ C GOVT. AGRICULTURE PROJECT BUSINESS MODEL ప్రతి మండలంలో మండల కేంద్రం ఏర్పాటు చేసుకోనుటకు మండలం వారిగా ఏజెంట్ కావలెను. అర్హత: 10th to Degree మంచి కమిషన్ UP TO 30K+ ఆపైన P/M. సంప్ర: 8297312412. [A-1414]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

www.sakshi.com సాక్షి స్పోర్ట్స్

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసాపురం డివిజన్

✆ 90102 23729 (ఆచంట)

✆ 90102 01609 (నరసాపురం)

✆ 95055 07552 (పాలకొల్లు)

Office mail : tpgadvt@gmail.com